క్లుప్తంగా

వేడుకగా పోలేరమ్మ కొలుపులు



కారంచేడులో పోలేరమ్మ తల్లి కొలుపుల్లో యువత, భక్తులు

కారంచేడు: ప్రతి ఏటా సాగుకు ముందు గ్రామ దేవత పోలేరమ్మ తల్లికి కొలుపులు నిర్వహించడం ఆనవాయితీ. దీనిలో భాగంగా ఈ ఏడాది వ్యవసాయ పనులు ప్రారంభానికి ముందుగా గ్రామంలోని యజ్ఞశాలపేటలో కొలుపులను ఘనంగా నిర్వహించారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు అభిషేకాలు నిర్వహించారు. మధ్యాహ్నం అమ్మవారికి పొంగళ్లు నైవేద్యంగా సమర్పించారు. సాయంత్రం గ్రామ దేవతను ప్రత్యేకంగా అలంకరించిన ప్రత్యేక వాహనంపై ఉంచి ఊరేగించారు. యువతీ, యువకులు వీరతాళ్లతో అమ్మవారి ప్రతిమకు ముందు నృత్యాలు చేశారు.

కుక్కల దాడిలో బాలుడికి తీవ్రగాయాలు

బల్లికురవ: బయట ఆడుకుంటున్న బాలుడిపై కుక్కలు మూకుమ్మడిగా దాడి చేయడంతో బాలుడు తీవ్ర గాయాల పాలయ్యాడు. ఈ ఘటన ఆదివారం మండలంలోని కొప్పరపాడు గ్రామంలో జరిగింది. అందిన సమాచారం మేరకు గ్రామంలోని సుగాలి తండాకు చెందిన డెంబావత్ ఆయుష్ నాయక్ ఇంటి ముందు తోటిపిల్లలతో ఆడుకుంటుండగా కుక్కలు ఒక్కసారిగా దాడి చేసి బాలుని తల, ముఖం, కాళ్లు చేతలపై తీవ్రంగా గాయపరచాయి. తండ్రి పేతురూ నాయక్ హుటాహుటిన బాలుడిని అద్దంకి ప్రభుత్వ వైద్యశాలకు చికిత్స నిమిత్తం తరలించారు. ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన చికిత్స కోసం ఒంగోలు వైద్యశాలకు తరలించారు. గ్రామంలో రెండు నెలలుగా కుక్కలు స్వైర విహారం చేస్తున్నాయని, సంబంధిత అధికారులు కుక్కల బెడద తప్పించాలని గ్రామస్తులు వేడుకుంటున్నారు.

సెల్‌ఫోన్ అప్పగింత



బాధితుడికి సెల్‌ఫోన్ అందిస్తున్న ఎస్సై తిరుపతిరావు

జే.పంగులూరు: పోగొట్టుకున్న సెల్‌ఫోన్‌ను బాధితుడికి అందజేశారు పోలీసులు. మండల పరిధిలోని జాగర్లమూడివారిపాలేనికి చెందిన ఉంగరాల ప్రసాద్‌కు ఆదివారం రేణింగవరం ఎస్సై తిరుపతిరావు సెల్ ఫోన్ అందించాడు. ప్రసాద్ గ్రామంలోని రోడ్డుపై ఉండగా బైకుపై ఇద్దరు వ్యక్తులు వచ్చి అడ్రసు అడిగి వెంటనే జేబులోని సెల్‌ఫోన్ లాక్కొని ఉడాయించారు. అదే రోజు బాధితుడు ప్రసాద్ రేణింగవరం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు సెల్‌ఫోన్ ఈఎంఐ సహాయంతో సాంకేతిక పరిజ్ఞానం ఉపయోగించి దొంగల నుంచి సెల్ ఫోన్ రాబట్టి బాధితుడికి అప్పగించారు.

పోలవరం పోరుకేకకు సంఘీభావం

ఒంగోలు టౌన్: పోలవరం నిర్వాసితులకు పరిహారం అందించాలని కోరుతూ పోలవరం పోరుకేక పేరుతో జూన్ 20వ తేదీ ప్రారంభమైన పాదయాత్రకు ప్రకాశం జిల్లా వ్యవసాయ కార్మిక సంఘ నాయకులు సంఘీభావం ప్రకటించారు. ఆదివారం హనుమాన్ జంక్షన్‌కు చేరుకున్న పాదయాత్రలో పాల్గొన్న ఆ సంఘ జిల్లా కార్యదర్శి కంకణాల ఆంజనేయులు ఒక ప్రకటన విడుదల చేశారు. ఆర్అర్ ప్యాకేజీ కింద నిర్వాసితులందరికీ భూమి ఇవ్వాలని డిమాండ్ చేశారు. 2013 భూసేకరణ చట్టం ప్రకారం ప్యాకేజీ ఇవ్వాలని కోరారు. జిల్లా నాయకులు కేజీ మస్తాన్, వెంకటేశ్వర్లు, వెల్లంపల్లి ఆంజనేయులు పాల్గొన్నారు.

అన్నదాతకు అభయం

మండలంలో ఆర్బీకేల సంఖ్య	18
మొత్తం రైతులు	12,400
రైతు భరోసా పొందిన రైతులు	10,104
రైతు భరోసా సాయం	రూ.13.64 కోట్లు
క్లస్టర్ హైరింగ్ సెంటర్లు	19
ఎరువుల విక్రయం	1400 టన్నులు
పచ్చిరొట్ట విత్తనాలు	115 క్వింటాళ్లు
యంత్ర పరికరాలు	రూ.3.49 కోట్లు
ధాన్యం కొనుగోలు	రూ.6 కోట్లు
పంట బీమా పొందిన రైతులు	3,701 మంది



తిమ్మాయపాలెం: రైతు భరోసా కేంద్రం

- రైతు భరోసా కేంద్రాల ద్వారా విశిష్ట సేవలు
- సొంత గ్రామాల్లోనే నాణ్యమైన ఎరువులు, విత్తనాలు
- అధునాతన పనిముట్ల అందజేత

అద్దంకి: వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో రైతులు సంతోషంగా జీవిస్తున్నారు. రైతు భరోసా కేంద్రాలను ఏర్పాటు చేసి మండల కేంద్రానికి వెళ్లే పనిలేకుండా ఇంటి ముంగిటికే పథకాలు, ఆధునిక యంత్రాలను అందిస్తున్నారు. ఇలా దేశంలోని అన్ని రాష్ట్రాలకు ఏపీ ఆదర్శంగా నిలిచింది.

ఎన్నో సేవలు

భూసార పరీక్షలు, పంట నమోదు, కౌలు రైతు కార్డులు, పంట నమోదు (ఈ క్రాప్) పంటల బీమా, గిట్టుబాటు ధర, వ్యవసాయ పుస్తక లైబ్రరీ, క్లియోస్క్ యంత్రం, ఎరువులు, విత్తనాల గిడ్డంగి, ధాన్యం కొనుగోలు, పొలం బడి (వ్యవసాయ ఉద్యాన శాఖ ఆధ్వర్యంలో), ప్రకృతి వ్యవసాయం, క్లస్టర్ హైరింగ్ గ్రూపుల ద్వారా రాయితీపై ట్రాక్టర్లు, వ్యవసాయ యంత్ర పరికరాలు, సంచార పశువైద్యం, ఆర్బీకేలోనే పశుమిత్ర, పశుదాణా, మందులు, బ్యాంకింగ్ సేవలు అందుతున్నాయి.

క్యూఆర్ కోడ్‌తో మట్టి నమూనాలు..

గతంలో ఎన్నడూ లేని విధంగా మండలంలో ఈ సంవత్సరం 537 శాంపిల్స్‌ను వ్యవసాయాధికారులు సేకరించారు. రెండు మూడు రోజుల్లో బాపట్ల నుంచి వాటికి సంబంధించిన ఫలితాలు రానున్నాయి. ఈ-క్రాప్ బుకింగ్, పంట బీమా చేస్తున్నారు. ప్రకృతి వైపరీత్యాలు సంభవిస్తే ఏ సంవత్సరం సాయం ఆ ఏడాదే అందిస్తున్నారు.

ప్రతి సంవత్సరం భరోసా..



నాకు నాలుగు సంవత్సరాల నుంచి ప్రతి సంవత్సరం రైతు భరోసా సాయం అందుతోంది. ఆ డబ్బు పెట్టుబడి సాయంగా ఉపయోగపడుతోంది.

– డి. మల్లికార్జున, రైతు

విత్తనాలు, ఎరువులు దగ్గరలోనే..



మాకు మా వూరులోనే విత్తనాలు ఎరువులు తక్కువ ధరకే లభిస్తున్నాయి. గతంలో అలా లేదు. విత్తనాల కొట్టుకెళ్లి కొనుగోలు చేస్తే నకిలీ విత్తనాలు అమ్మేవారు.

– మద్దు శీతయ్య , రైతు

బహుళ ఉపయోగకారి ఆర్బీకేలు..



ఆర్బీకేలు రైతులకు బహుళ ఉపయోగకారులుగా నిలిచాయి. ప్రకృతి వ్యవసాయం, ఇ- క్రాప్, ఉచితంగా మట్టి పరీక్షలు, గిట్టుబాటు ధర వంటి ఎన్నో సేవలు రైతులకు మేలు చేస్తున్నాయి.

– వెంకటకృష్ణ, ఏవో

ఇంటి ముంగిటకే ధ్రువపత్రాలు

సాక్షి నెట్‌వర్క్: సీఎం జగన్ మోహన్‌రెడ్డి నవరత్నాల సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి దేశం మొత్తం రాష్ట్రం వైపు చూసేలా చేశాడు. ఈనాలుగేళ్లలో అటు సంక్షేమం, ఇటు అభివృద్ధి రెండు కళ్లలా భావిస్తూ సుపరిపాలన సాగిస్తున్నాడు. అర్హులై ఉండి పథకాలు సాంకేతిక కారణాల వల్ల అందని వారికి జగనన్న సురక్ష పథం ద్వారా ఇంటికే వెళ్లి అందిస్తున్నారు. 11 రకాల ధ్రువపత్రాలు, ఇతర పథకాలను సైతం అప్పటికప్పుడే పరిష్కరించి అందిస్తున్నారు. దీంతో లబ్ధిదారులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. గతంలో ఇలా ఉండేదికాదని చెప్తున్నారు.

ఏ అధికారి చుట్టూ తిరగాల్సినవసరం లేదు..



ఇతని పేరు షేక్ మస్తాన్ వలి జే.పంగులూరు మండలం అలవలపాడు గ్రామం. గతంలో కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాల కోసం మండల కార్యాలయాల చుట్టూ రోజూ తిరగాల్సి వచ్చేది. అప్పుడు రా.. సాయింత్రం రా అంటూ కాలం వెళ్లదీసేవారు. ఒక్కోసారి వెళ్తే అధికారులు ఎక్కడికో వెళ్లారు అని సమాధానం వచ్చేది. కాని జగనన్న ప్రభుత్వం వచ్చిన నాటి నుంచి వలంటీర్ వ్యవస్థతో ప్రతి పని ఎంతో సులువైంది.. అధికారుల చుట్టూ తిరిగే పని లేకుండా పోయిందని చెప్పాడు. జగనన్న సురక్ష పథకంలో భాగంగా శనివారం కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు పైసా ఖర్చు లేకుండా దరఖాస్తు చేసిన రోజే ఇచ్చారని ఆనందం వ్యక్తం చేశాడు.

షేక్ మస్తాన్‌వలి, అలవలపాడు

వెనువెంటనే అవసరమైన ధ్రువపత్రాలు..

ఈమె పేరు పారి నాగమ్మ, భర్త పేరు పారి పెదవీరయ్య, కారంచేడు మండలం ఆదిపూడి గ్రామంలోని ఎస్సీ కాలనీ. ఈమెకు వైఎస్సార్ చేయూత స్కీంలో లబ్ధి పొందేందుకు అవసరమైన ఆదాయ, కుల ధ్రువీకరణ పత్రాలు అవసరం అయ్యాయి. స్థానిక వలంటీర్ నాగరాజుకు విషయం తెలిపి సరిఫికెట్ కోసం అర్జీ పెట్టుకుంది. దీంతో వెంటనే సంబంధిత రెవెన్యూ అధికారులు ఆమె కుటుంబ పరిస్థితులు అధ్యాయనం చేసి వెంటనే సర్టిఫికెట్ మంజూరు చేయడమే కాకుండా వెంటనే జగనన్న సురక్ష కార్యక్రమంలో అందజేశారు. దీంతో ఇంత త్వరగా సర్టిఫికెట్లు పొందడం చాలా సంతోషంగా ఉందని చెప్తోంది.



పారి నాగమ్మ, ఆదిపూడి

వైఎస్సార్ సీపీ పాలనతో సంతోషం



ఈమె పేరు పావులూరి నవ్య, బల్లికురవ గ్రామం. గతంలో కుల ఆదాయ ధ్రువీకరణ పత్రాలకు అర్జీ పెట్టినా రాలేదు. దీంతో ఆమె జగనన్న సురక్ష కార్యక్రమంలో శనివారం అర్జీ పెట్టుకున్న వెంటనే అధికారులు ఆమెకు వెంటనే ఎలాంటి రుసుము లేకుండా కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. గతంలో ఈ పత్రాలకు దరఖాస్తు చేసుకుంటే నెలల తరబడి తిరగాల్సి వచ్చేది. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో వెంటనే ఇవ్వడం ప్రజల వద్దకే పాలన తీసుకురావడంపై వారు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

పావులూరి నవ్య, బల్లికురవ

సమాజ సేవలో రోటరీ క్లబ్ ముందంజ



ఇంకొల్లులో పేదలకు చీరలు పంపిణీ చేస్తున్న వాసవీ క్లబ్ ప్రతినిధులు



అద్దంకిలో పేదలకు బియ్యం అందిస్తున్న క్లబ్ సభ్యులు

అద్దంకి: సమాజ సేవలో రోటరీ క్లబ్ ముందంజలో ఉంటుందని ఇంటర్నేషనల్ అడ్మినిస్ట్రేటివ్ వైస్ ప్రసిడెంట్ వూటుకూరు ఉమా అన్నపూర్ణ అన్నారు. వాసవీ క్లబ్ ఆధ్వర్యంలో డాన్ టు డెస్క్ కార్యక్రమాన్ని ఆదివారం హరిహర గోకులక్షేత్రంలో నిర్వహించారు. ముఖ్య అతిథిగా అన్నపూర్ణ హాజరయ్యారు. దీనిలో భాగంగా రైతు దినోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ఇద్దరు రైతులకు ఎరువులు, పురుగు మందులను అందజేశారు. కార్యక్రమాల్లో వాసవీ, వనిత క్లబ్ సభ్యులు, నాయకులు పాల్గొన్నారు.

ఇంకొల్లులో..

ఇంకొల్లు (చినగంజాం): ఇంకొల్లు వాసవీ క్లబ్ డాన్ టూ డెస్క్ కార్యక్రమంలో భాగంగా ఆదివారం పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. వాసవీ క్లబ్ ఇంటర్నేషనల్ ఆదేశాల మేరకు నలుగురు పేదలకు నిత్యావసర సరుకులు పంపిణీ, బస్ స్టేషన్, బీసీ కాలనీ బస్ రిక్వెస్ట్ స్టాప్‌ల వద్ద సిమెంట్ బల్లల ఏర్పాటు, పేద రైతు కుటుంబానికి పిచికారీ యంత్రం పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఐఈసీ అధికారి విద్యాల రామేశ్వర్, ఐపీసీ అధికారి గట్టుపల్లి మాదవి, ఏల్చూరి సాంబశివరావు, దోగిపర్తి అయ్యప్ప స్వామి, క్లబ్ అధ్యక్షుడు చిన్ని పూర్ణారావు, కార్యదర్శి బదరీ నారాయణ, కోశాధికారి నరసింహ శెట్టి, క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.



యనమదలలో ఫ్యాన్లు పంపిణీ చేస్తున్న సభ్యులు

యద్దనపూడి: డాన్ టు డెస్క్ కార్యక్రమంలో భాగంగా వాసవీ క్లబ్ యద్దనపూడి ఆధ్వర్యంలో యనమదల వీరాంజనేయ స్వామి దేవస్థానంలో 8 సీలింగ్ ఫ్యాన్లు, ఐదుగురు మహిళలకు నిత్యావసర వస్తువులు, చీరలు పింపిణీ చేశారు. ఏఎస్ఐ సాయి తదితరులను సన్మానించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా రీజియన్ చైర్ పర్సన్ చుండూరి గాయత్రి, ఎం రాఘవేంద్రరావు, సిల్వర్ స్టార్ కేసీజీఎఫ్ టీ నాగభూషణం తదితరులు పాల్గొన్నారు

చీరాల రోటరీ క్లబ్ నూతన కార్యవర్గం ఎన్నిక

చీరాల అర్బన్: సమాజ సేవే లక్ష్యంగా రోటరీ క్లబ్ తన సేవా కార్యక్రమాలను మరింత విస్తృతం చేస్తుందని రోటరీ పాస్ట్ డిస్ట్రిక్ గవర్నర్ తాళ్ల రాజశేఖరరెడ్డి అన్నారు. ఆదివారం స్థానిక రోటరీ కమ్యూనిటీ హాలులో రోటరీ క్లబ్ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకార కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన మున్సిపల్ చైర్మన్ జంజనం శ్రీనివాసరావు మాట్లాడుతూ రోటరీ క్లబ్ సహాయంతో లక్ష మొక్కలు నాటి, గడియార స్తంభం ఏర్పాటు చేయడానికి కృషి చేస్తామన్నారు. అనంతరం రోటరీ క్లబ్ చీరాల అధ్యక్షుడిగా మామిడాల శ్రీనివాసరావు, కార్యదర్శిగా చీరాల కృష్ణమూర్తి, కోశాధికారిగా పోలుదాసు రామకృష్ణ, 35 మంది డైరెక్టర్లు చేత ప్రమాణ స్వీకారం చేయించారు. కార్యక్రమంలో డాక్టర్ ఐ.బాబూరావు, అసిస్టెంట్ గవర్నర్ టీవీ సురేష్, ఇన్నర్‌వీల్ క్లబ్ సభ్యులు సుభాషిణి, లలిత కుమారి, పార్వతి, పివి తులసీ, బి.హేమంత్‌కుమార్, గుర్రం రాఘవరావు, పాద మురళీ, కరణం శ్రీనివాసబాబు, వలివేటి మురళీకృష్ణ, సభ్యులు పాల్గొన్నారు.



ప్రమాణ స్వీకారం చేస్తున్న సభ్యులు

పంట బీమా అర్హుల జాబితా సిద్ధం



బొల్లాపల్లిలో రైతుల జాబితా ప్రదర్శిస్తున్న అధికారులు

మార్టూరు: ఖరీఫ్ సీజన్ 2022 సంబంధించిన పంటల ఉచిత బీమా పథకానికి అర్హులైన రైతుల జాబితాను ఆయా గ్రామాల రైతు భరోసా కేంద్రాలలో రైతుల ప్రదర్శన కోసం సిద్ధంగా ఉంచినట్లు మార్టూరు ఏడీఏ కేవీ శ్రీనివాసరావు అన్నారు. బొల్లాపల్లి ఆర్బీకే సెంటర్‌లో ఆదివారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. రైతుల జాబితాలో తమ పేర్లను సరిచూసుకొని అభ్యంతరాలుంటే వెంటనే అధికారుల దృష్టికి తీసుకురావాలన్నారు. మార్టూరు సబ్ డివిజన్ పరిధిలోని మార్టూరు, బలికురవ, సంతమాగులూరు, జే పంగులూరు మండలాలకు చెందిన 2069 మంది రైతులకు వాతావరణ ఆధారిత పంటల బీమా పథకం కింద రూ 52.33 లక్షలు మంజూరయ్యాని చెప్పారు. దిగుబడి ఆధారిత పంటల బీమా పథకం ద్వారా 668 మంది రైతులకు రూ 85.32 లక్షలు చెల్లించేందుకు జాబితా సిద్ధం చేసినట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో నాలుగు మండలాల ఏవోలు, బొల్లాపల్లి రైతులు పాల్గొన్నారు.

బల్లికురవలో 2056 మంది రైతులకు పంటల బీమా

బల్లికురవ: ప్రభుత్వం మండలంలోని 20 రైతు భరోసా కేంద్రాల పరిధిలో 2056 మంది రైతులకు రూ.63.16 లక్షల పంట బీమా మంజూరు చేశారని వ్యవసాయాధికారిణి ఎస్‌వీపీ కుమారి ఆదివారం తెలిపారు. వీరందరికీ ఈనెల 8వ తేదీ రైతు దినోత్సవం సందర్భంగా సీఎం వైస్ జగన్ మోహన్‌రెడ్డి కళ్యాణదుర్గంలో రైతుల ఖాతాలకు సొమ్ము జమచేయనున్నట్లు తెలిపారు.

పంగులూరు రోటరీ క్లబ్ అధ్యక్షుడిగా కరణం



ప్రమాణం చేస్తున్న రోటరీ క్లబ్ నూతన కార్యవర్గం

జే.పంగులూరు: మండల పరిధిలోని పంగులూరు టీటీడీ కళ్యాణ మండపం నందు ఆదివారం పంగులూరు రోటరీ క్లబ్ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా రీజియన్ రామ్‌ప్రసాద్, డిస్ట్రిక్ట్ సెక్రటరీ సింగారావు, జీఎస్ఆర్ నాగబాబు, అసిస్టెంట్ గవర్నర్ ఆంజనేయులు ముఖ్యఅతిథిగా పాల్గొని నూతన కార్యవర్గం అయిన కరణం హనుమంతురావు, గుర్రం ఆంజనేయులు, షేక్ కాలేషావలితో ప్రమాణ స్వీకారం చేయించారు. కార్యక్రమంలో కొరిశపాడు మాజీ జెడ్పీటీసీ సభ్యుడు బాచిన చెంచుప్రసాద్, రోటేరియన్లు రాయిణీ వెంకటసుబ్బారావు, మాజీ అధ్యక్షులు జగదీశ్వరావు, రావూరి రంగారావు, గుర్రం ఆంజనేయులు, పోలిశెట్టి సీతారామయ్య, గరిమిడి జగన్మోహనరావు, చిలుకూరి వీరరాఘవయ్య తదితరులు పాల్గొన్నారు.

నేడు మల్లాయపాలెంలో గడప గడపకు మన ప్రభుత్వం

బల్లికురవ: మండలంలోని పాత మల్లాయపాలెం గ్రామంలో సోమవారం సాయంత్రం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు మండల పార్టీ కన్వీనర్ బాపట్ల జిల్లా రైతు అధ్యక్షుడు చింతల పేరయ్య ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమానికి రాష్ట్ర శాప్‌నెట్ చైర్మన్, వైఎస్సార్ సీపీ అద్దంకి నియోజకవర్గ ఇన్‌చార్జి బాచిన కృష్ణ చైతన్య ముఖ్య అతిథిగా హాజరు కానున్నట్లు తెలిపారు. మండల స్థాయి అధికారులు, ప్రజా ప్రతినిధులు హాజరు కావాలని కోరారు.

పుస్తక పఠనంతో విజ్ఞానం



గ్రంథాలయంలో ఉన్న చిన్నారులు

సంతమాగులూరు (అద్దంకి): గ్రంథ పఠనంతో విజ్ఞానం లభిస్తుందని గ్రంథపాలకుడు భాస్కర రెడ్డి అన్నారు. మొదటి ఆదివారంలో భాగంగా చదవడం మాకు ఇష్టం కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో మొత్తం 18 మంది విద్యార్థులు పాల్గొని పుస్తకాలు చదివారు. వారికి పుస్తకాలు చదవడం వలన కలిగే లాభాలను గ్రంథపాలకుడు వివరించాడు.

ఘనంగా గంగమ్మ తల్లి పొంగళ్ల ఉత్సవం



గంగమ్మతల్లి దర్శనానికి బారులు తీరిన భక్తులు



ప్రత్యేక అలంకరణలో గంగమ్మ తల్లి

చీరాల అర్బన్: పట్టణంలోని యాదవపాలెంలో వేంచేసియున్న గంగమ్మ అమ్మవారి పొంగళ్ల ఉత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయం నుంచి ఆలయం వద్ద అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహిళలు పెద్ద సంఖ్యలో ఆలయం వద్దకు చేరుకొని పొంగళ్లు, వడపప్పు, పానకం, చలివిడిని అమ్మవారికి నైవేద్యంగా సమర్పించారు. మేళతాళాలు, కనక తప్పెట్లుతో అమ్మవారి నగరోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. సాయంత్రం అమ్మవారికి జలశుద్ధి కార్యక్రమం నిర్వహించారు. భక్తులు ఆలయం వద్దకు చేరుకొని మొక్కులు చెల్లించారు. అనంతరం కమిటీ ప్రతినిధులు మాట్లాడుతూ గత కొన్ని సంవత్సరాలుగా అమ్మవారి పొంగళ్లు ఉత్సవం నిర్వహిస్తున్నామని, ముఖ్యంగా గంగమ్మ అమ్మవారు ఎంతో మహిమ గల దేవతని, కోరిన కోర్కెలు నెరవేరుస్తుందన్నారు. అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు బారులు తీరారు.

పోషకాహారంతో మెరుగైన ఆరోగ్యం



కార్యక్రమంలో మాట్లాడుతున్న డాక్టర్ కృష్ణచైతన్య

చీరాల: వయస్సు పైబడిన వారు కాల్షియం ఎక్కువగా ఉన్న పదార్థాలను ఆహారంగా తీసుకోవాలని కామాక్షి కేర్ హాస్పిటల్ ఎముకల స్పెషలిస్ట్ డాక్టర్ కృష్ణ చైతన్య పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ సీనియర్ సిటిజెన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ చీరాల శాఖ ఆధ్వర్యంలో సింహాద్రి యల్లమందారెడ్డి అధ్యక్షతన ఆరోగ్యంపై అవగాహన కార్యక్రమాన్ని ఆదివారం చీరాల ప్రాంతీయ కార్యాలయంలో నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాస్పిటల్ ఎండీ తాడివలస దేవరాజు, డాక్టర్ కృష్ణచైతన్యలు సలహాలు, సూచనలు అందించారు. కార్యక్రమంలో కట్టా రాజ్ వినయ్‌కుమార్, రామారావు, ఊటుకూరి వెంకటేశ్వర్లు, మేడా వెంకటరావు, దశరథరామయ్య, శివాంజనేయప్రసాద్, గట్టు సామ్రాజ్యం, జయరామరెడ్డి, అల్లూరయ్య, రామకృష్ణ శర్మ తదితరులు పాల్గొన్నారు.